19న ఉచిత ఆధార్‌ నమోదు కేంద్రం ప్రారంభం


అహ్మద్‌ హుస్సేనీ సయ్యద్‌ ఖాద్రీ

శాలిబండ: ఖాజీపురాలోని సయ్యద్‌ మంజిల్‌లో ఈ నెల 19న ప్రజల కోసం ఉచిత ఆధార్‌ కార్డు క్యాంపును ప్రారంభించనున్నట్లు ఖాద్రియా ఇంటర్నేషనల్‌ ఆర్గనైజేషన్‌ అధ్యక్షుడు మౌలానా సయ్యద్‌ అహ్మద్‌ హుస్సేనీ సయ్యద్‌ ఖాద్రీ తెలిపారు. ఖాద్రియా ఇంటర్నేషనల్‌ ఆర్గనైజేషన్‌ భారత ప్రభుత్వ ఇండియా పోస్ట్‌ సహకారంతో ఆధార్‌ కార్డు క్యాంపును నిర్వహిస్తున్నామన్నారు. ప్రతిరోజు 9.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పని చేస్తుందన్నారు. సమాజానికి సేవ చేయడానికి ఒక ముఖ్యమైన చర్యగా, ఇండియా పోస్టు ద్వారా నియమించిన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు ఈ శిబిరం సమయంలో ఆధార్‌ నమోదు, నవీకరణ ప్రక్రియను సులభతరం చేస్తారన్నారు.

ఆర్థిక సాయం


రెజ్లర్లకు ఆర్థిక సాయం అందజేస్తున్న గడ్డం శ్రీనివాస్‌ యాదవ్‌

అబిడ్స్‌: చండీగఢ్‌లో జరుగుతున్న జాతీయ అండర్‌–17 రెజ్లింగ్‌ చాంపియన్‌షిప్‌ పోటీలకు తెలంగాణ నుంచి పాల్గొంటున్న 22 మంది రెజ్లర్లు మెడల్స్‌ సాధించి తిరిగి రావాలని హైదరాబాద్‌ రెజ్లింగ్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్‌యాదవ్‌ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం తన కార్యాలయంలో పలువురు రెజ్లర్లకు ఫౌండేషన్‌ తరఫున ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రెజ్లింగ్‌ అసోసియేషన్‌ నేతలు సంతోష్‌ పహిల్వాన్‌, అస్లాం తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తికి 5 నెలల జైలు


మన్మోహన్‌సింగ్‌

అబిడ్స్‌: ఎక్సైజ్‌ అధికారి విధులకు ఆటంకం కల్గించడంతో పాటు ఉద్దేశపూర్వకంగా ఆయనపై దాడికి ప్రేరేపించిన కేసులో పేరుమోసిన గంజాయి వ్యాపారి, మంగళ్‌హాట్‌ రౌడీషీటర్‌ మన్మోహన్‌సింగ్‌కు 5 నెలల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ నాంపల్లిలోని 16వ అదనపు చీఫ్‌ జుడిషియల్‌ మెజిస్ట్రేట్‌ జి.ప్రభాకర్‌ తీర్పునిచ్చారు. సౌత్‌వెస్ట్‌జోన్‌ డీసీపీ చంద్రమోహన్‌ తెలిపిన వివరాల ప్రకారం..అప్పర్‌ ధూల్‌పేట్‌ బలరాంగల్లీకి చెందిన మన్మోహన్‌ సింగ్‌(41) వృత్తిరీత్యా గంజాయి వ్యాపారి, అతనిపై మంగళ్‌హాట్‌ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీట్‌ ఉంది. ఇప్పటికే పలు కేసుల్లో నిందితుడైన అతను ప్రస్తుతం హత్యాయత్నం కేసులో జైల్లో ఉన్నాడు. 2018లో ధూల్‌పేట్‌ ఎక్సైజ్‌ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఈఎస్‌ నవీన్‌కుమార్‌ను (ప్రస్తుతం ఈఎస్‌గా మల్కాజ్‌గిరిలో పనిచేస్తున్నారు.)అడ్డుకోవడంతో పాటు అధికారిపై దాడికి ప్రేరేపించిన కేసులో మంగళ్‌హాట్‌ పీఎస్‌లో కేసు నమోదు చేశారు. అప్పట్లో రౌడీషీటర్‌ మన్మోహన్‌సింగ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో ఛార్జీషీటు దాఖలు చేయగా పరిశీలించిన కోర్టు శుక్రవారం నిందితుడికి 5 నెలల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.5వేల జరిమాన విధిస్తూ తీర్పుచెప్పింది. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడటంలో అవసరమైన సాక్ష్యాలను కోర్టులో సమర్పించిన ఎస్‌ఐ శివానంద్‌తో పాటు సీఐ మహేష్‌గౌడ్‌, ఏసీపీ వెంకట్‌రెడ్డిల కృషిని డీసీపీ అభినందించారు.

నకిలీ ఐటీ కంపెనీలపై చర్యలు తీసుకోవాలి

పంజగుట్ట: పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న నకిలీ ఐటీ కంపెనీలు, కన్సల్టెన్సీలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని ఆమ్‌ ఆద్మీ పార్టీ సెంట్రల్‌ కమిటీ సభ్యుడు విజయ్‌ మల్లంగి డిమాండ్‌ చేశారు. లక్షలు చెల్లించి అమాయకులు మోసపోతున్నారని ఆయన పేర్కొన్నారు. ఇటీవల 200 మంది నిరుద్యోగులను మోసం చేసిన గచ్చిబౌలి లోని ప్యూర్‌ పాల్‌ ఐటీ సంస్థ బాధితులతో కలిసి ఆయన శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బాధితులు సూర్యతేజ, వెంకటేష్‌, ఆదిత్యతో కలిసి మాట్లాడుతూ .. మొదటిమూడు నెలలు వర్క్‌ఫర్‌ హోం నమ్మించి ఆఖరుకు బిచాణా ఎత్తేశారని పేర్కొన్నారు. సుమారు 200 మంది బాధిత నిరుద్యోగులు ఒక్కొక్కరు 1.8 నుండి 2.5 లక్షల వరకు వసూలు చేశారని ఆవేదనవ్యక్తం చేశారు. ఆమ్‌ ఆద్మీ పార్టీ ప్రతినిధులు యమున గౌడ్‌, సుధారాణి, రాకేష్‌ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


నిందితులను శిక్షించాలని డిమాండ్‌ చేస్తున్న ఆప్‌ నేతలు, బాధితులు

19 నుంచి రంగనాథస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు


బ్రోచర్‌ విడుదల చేస్తున్న జీవన్‌సింగ్‌, ఆలయ ట్రస్టీ ఎస్‌.టి.చారి, ప్రతినిధులు శేషాచార్యులు, శ్రీనివాస రంగనాథ చార్యులు

జియాగూడ: జియాగూడ రంగనాథ స్వామి ఆలయంలో ప్రతి సంవత్సరం మాదిరిగానే బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించడానికి సిద్ధం కావడం హర్షనీయమని గ్రేటర్‌ హైదరాబాద్‌ ఆలయాల పరిరక్షణ సమితి అధ్యక్షులు ఠాకూర్‌ జీవన్‌ సింగ్‌ అన్నారు. శుక్రవారం జియాగూడ శ్రీ రంగనాథ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల బ్రోచర్‌లను ఆలయ ఫౌండర్‌ ట్రస్టీ ఎస్‌.టీ.చారి, ప్రతినిధి శేషాచారి, ప్రధాన అర్చకులు శ్రీనివాస రంగనాథ చార్యులు, బద్రినాథ్‌ చారి, శ్రీ రంగనాథ సేవా సమితి సభ్యులతో కలిసి విడుదల చేశారు. అనంతరం ఆలయ ప్రతినిధి శేషాచారి మాట్లాడుతూ..రెండేళ్ల నుంచి ఆలయ జీర్ణోద్ధారణ పనులు శాస్త్ర, వాస్తు, శిల్ప కళలతో కంచి, శ్రీ కాళహస్తి తరహాలో నిర్మిస్తున్నామని, ప్రస్తుతం బాలలయంలో స్వామి వారికి పూజలు, భక్తులకు దర్శనం కల్పిస్తున్నామని, ప్రస్తుతం బాలలయంలో స్వామివారికి పూజలు, భక్తులకు దర్శనం కల్పిస్తున్నామన్నారు. 19న శ్రీ రంగనాథస్వామి మూల విరట్‌ ప్రాణ ప్రతిష్ఠ, సాయంత్రం నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం అవుతాయన్నారు.

20న గరుడ ప్రసాద పంపిణీ..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా 20వ తేదీ ఉదయం 10 గంటలకు గరుడ ప్రసాద పంపిణీ కార్యక్రమం ఉంటుంది. సంతానం కాని మహిళల కోసం ప్రత్యేకంగా విశిష్ట పూజలు నిర్వహించి వారికి మాత్రమే గరుడ ప్రసాదం ఇవ్వబడుతుందని తెలిపారు.

22న సాయంత్రం శ్రీ రంగనాథ కల్యాణం..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా 22న సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ రంగనాథ స్వామి కల్యాణ మహోత్సవం భారీ ఎత్తున నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాస రంగనాథచార్యులు తెలిపారు. గరుడ ప్రసాదం స్వీకరించిన మహిళలు కుటుంబ సభ్యులతో కల్యాణ మహోత్సవంలో పాల్గొనవచ్చన్నారు. అనంతరం ప్రసాద వితరణ ఉంటుందన్నారు.

23న రథోత్సవం..

ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సారి రంగనాథస్వామి వారి రథోత్సవం ఆలయ ప్రాంగణం నుంచి మొదలై పురానాపూల్‌ చౌరస్తా వరకు రథోత్సవ ఊరేగింపు కొనసాగుతుందన్నారు. అలాగే 24న చక్రస్నానం, 25న 1.25 లక్షల వివిధ రకాల పుష్పాలతో పుష్పయాగం, ద్వాదషా ఆరాధన, సాయంత్రం 108 కలశాలతో దేవేరులకు మహా అభిషేకం, మహా పూర్ణాహుతి, 28న 1001 కలశాలతో కలషాభిషేకంతో ఉత్సవ సమాప్తి అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ రంగనాథ సేవా సమితి సభ్యులు గూడుమని చంద్రకాంత్‌, నరహరిచారి, జగదీష్‌ యాదవ్‌, లక్ష్మీనారాయణ, బొట్టు రామ్‌, శ్రీనివాస్‌గుప్తా, శంకర్‌రాజ్‌, ప్రకాష్‌చారి, సందీప్‌లాల్‌ యాదవ్‌, సంతోష్‌, నరేష్‌, మల్లేష్‌ యాదవ్‌, రామ్‌కుమార్‌ పాల్గొన్నారు.

అనాటమీకి మృతదేహం అప్పగింత


సర్దార్‌ నానక్‌ సింగ్‌ (ఫైల్‌)

నాంపల్లి: ఎవరైనా పరమపదిస్తే ఘనంగా శ్రద్ధాంజలి ఘటిస్తారు. ప్రముఖులతో నివాళులర్పిస్తారు. కానీ ఈ దంపతులు అందరిలాగా కాకుండా తమ కుటుంబంలో చనిపోయిన వ్యక్తి మృతదేహాన్ని అనాటమీకి అప్పగించి మానవీయతను చాటుకున్నారు. వైద్య రంగంలో అనాటమీ అంటే మృతదేహాల మీద అధ్యయనం చేసే విభాగం. సాధారణంగా అనాటమీకి అనాథల శవాలను మాత్రమే వినియోగిస్తుంటారు. కానీ ప్రముఖ చిన్న పిల్లల ఆసుపత్రి నిలోఫర్‌ మాజీ సూపరింటెండెంట్‌ డాక్టర్‌ విక్రమ్‌జీత్‌ సింగ్‌ మామ, ప్రముఖ దంత వైద్యురాలు డాక్టర్‌ భూపేందర్‌ కౌర్‌ తండ్రి సర్దార్‌ నానక్‌ సింగ్‌ శుక్రవారం పరమపదించారు. నగరానికి చెందిన సర్దార్‌ నానక్‌ సింగ్‌ ఒక సంఘ సంస్కర్త, సిక్‌ స్కాలర్‌. తాను తుది శ్వాస విడిస్తే తన దేహాన్ని అనాటమీకి ఇవ్వాలని 40 ఏళ్ల క్రితమే ఆయన కుటుంబ సభ్యులను కోరారు. ఆయన కోరిక మేరకు ఉస్మానియా మెడికల్‌ కళాశాల అనాటమీ డిపార్ట్‌మెంట్‌కి అందజేసినట్లు డాక్టర్‌ విక్రమ్‌జీత్‌ సింగ్‌, డాక్టర్‌ భూపేందర్‌ కౌర్‌ దంపతులు తెలిపారు. ఇది మంచి పరిణామం అని నిలోఫర్‌ ఆసుపత్రి సూపరింటెండెంట్‌ డాక్టర్‌ ఎస్‌.రవికుమార్‌ పేర్కొన్నారు. ఈ విధంగా చాలా తక్కువ మంది ఆలోచిస్తారని చెప్పారు. వైద్య విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు


బస్తీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే జాఫర్‌ హుస్సేన్‌ మేరాజ్‌

యాకుత్‌పురా: ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే జాఫర్‌ హుస్సేన్‌ మేరాజ్‌ అన్నారు. శుక్రవారం స్థానిక మసీదులో నిర్వహించిన ప్రార్థనల అనంతరం యాకుత్‌పురా, రెయిన్‌బజార్‌ చమన్‌, బడాబజార్‌, షౌకాత్‌ జంగ్‌ దేవిడి, దరాబ్‌ జంగ్‌ కాలనీ, గంగానగర్‌ నాలా తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. స్థానిక బస్తీల్లో నెలకొన్న సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..బస్తీలో పర్యటిస్తూ సమస్యల పరిష్కారానికి నూతన అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. ఎక్కడ సమస్యలు లేకుండా అన్ని విభాగాల అధికారులతో క్షేత్రస్థాయిలో పర్యటనలు చేస్తూ చర్యలు తీసుకుంటున్నమని తెలిపారు. ఈ పర్యటనలో స్థానిక మజ్లిస్‌ పార్టీ నాయకులు, జీహెచ్‌ఎంసీ, జలమండలి విభాగాల అధికారులు పాల్గొన్నారు.

డెంగీ, మలేరియా వ్యాధులపై ప్రజలకు అవగాహన



అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

చాంద్రాయణగుట్ట: జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం చాంద్రాయణగుట్టలోని కుమ్మర్‌ వాడీ, హరిజన బస్తీ, గాంధీబొమ్మ, కేశవగిరి, తాళ్లకుంట తదితర ప్రాంతాల్లో డెంగీ, మలేరియా వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చార్మినార్‌ జోన్‌ సీనియర్‌ ఎంటమాలజిస్ట్‌ నామాల శ్రీనివాస్‌ మాట్లాడుతూ..ప్రజలు తమ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమల నియంత్రణకు ఇంట్లోని నీటిపై మూతలు ఉంచాలన్నారు. మలేరియా సిబ్బంది ప్రతి వారం డెంగీ, మలేరియా వ్యాధులపై అవగాహన కలిప్తూ ప్రజలకు చైతన్య పరుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మయ్య, విష్ణువర్ధన్‌ రెడ్డి, జంగ్లీ రమేశ్‌, నవీన్‌, సాయి కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

శిథిలమైన విద్యుత్‌ స్తంభాలను మార్చాలి


కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

బండ్లగూడ: శిథిలావస్థకు చేరుకుని ప్రమాదకరంగా తయారైన విద్యుత్‌ స్తంభాలను తొలగించి వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని బండ్లగూడ జాగీర్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌ పరిధిలోని ధాత్రి సోగ్నారె (హుడా) లే అవుట్‌ వాసులు కోరారు. కాంగ్రెస్‌ పార్టీ సీనియర్‌ నాయకులు సురేష్‌తో కలిసి శుక్రవారం కమిషనర్‌ బి.శరత్‌చంద్రను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... 18వ డివిజన్‌లోని ధాత్రి సోగ్నారె (హుడా) లే అవుట్‌లో విద్యుత్‌ వీధి దీపాల నిమిత్తం సుమారు 20 ఏళ్ల క్రితం అంటే లే అవుట్‌ రూపొందించిన కాలంలో ఏర్పాటు చేసిన ఇనుప స్తంభాలు తుప్పుపట్టి ప్రమాదకరంగా మారాయన్నారు. కమిషనర్‌ సానుకూలంగా స్పందించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. స్థానిక నేతలు ఎం.శివరామిరెడ్డి, కొండా ఆనందరెడ్డి, వి.భాస్కర్‌రెడ్డి, కొంపల్లి కామేష్‌రావు, కొత్త రాజవర్ధన్‌, జి.చంద్రశేఖర్‌ పాల్గొన్నారు.

జన్మదిన శుభాకాంక్షలు


ఎమ్మెల్యే కాలె యాదయ్యకు శుభాకాంక్షలు తెలుపుతున్న అసోసియేషన్‌ అధ్యక్షుడు జి.లక్ష్మీనారాయణ తదితరులు

అబిడ్స్‌: వాటర్‌వర్క్స్‌ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్‌ చైర్మన్‌, చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్యను ఆయన కార్యాలయంలో అసోసియేషన్‌ ప్రతినిధులు కలిశారు. అసోసియేషన్‌ అధ్యక్షులు జి.లక్ష్మీనారాయణ పుష్పగుచ్ఛాన్ని అందించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్‌ ప్రధాన కార్యదర్శి బి.నరసింగరావు, వైస్‌ చైర్మన్‌ శంకర్‌ ప్రకాష్‌, వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ బి.అశోక్‌, ఎ.ఉదయ్‌కుమార్‌, కార్యదర్శి రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌ సరఫరా ఉండని ప్రాంతాలు

అఫ్జల్‌గంజ్‌: 11 కేవీ ఆగాపురా, గ్యాన్‌బాగ్‌ కాలనీ విద్యుత్‌ ఫీడర్‌ పరిధిలోని ఆగాపురా నాలా, సమాజ్‌ గ్రౌండ్‌, హబీబ్‌నగర్‌ పోలీస్‌, గ్యాన్‌ బాగ్‌ కాలనీ, నయాబస్తీ తదితర ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు అంతరాయం ఉంటుందని అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే ఎంజేమార్కెట్‌ విద్యుత్‌ ఫీడర్‌ పరిధిలోని కరాచి బేకరి, రిజిస్టర్‌ కార్యాలయం, పోస్టాఫీస్‌ లేన్‌, మాలకుంట తదితర ప్రాంతాల్లో 10 నుంచి 11 గంటల వరకు. సీతారామ్‌ బాగ్‌ ఫీడర్‌ పరిధిలోని గుఫా మందిర్‌, ఇందిరానగర్‌ తదితర ప్రాంతాల్లో సాయంత్రం 3 నుంచి 4 గంటల వరకు విద్యుత్‌ సరఫరాను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

నేడు తిరంగా యాత్ర

గౌలిపురా: ఆపరేషన్‌ సిందూర్‌ విజయోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 17న సాయంత్రం 4.30 గంటలకు తిరంగా యాత్రను నిర్వహించనున్నట్లు బీజేపీ గౌలిపురా డివిజన్‌ అధ్యక్షుడు ఇ.సుమన్‌ కుమార్‌ ముదిరాజ్‌ తెలిపారు. ఈ తిరంగా యాత్ర అంబేడ్కర్‌ విగ్రహం నుంచి స్వామి వివేకానంద విగ్రహం ట్యాంక్‌బండ్‌ వరకు కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేంద్ర మంత్రి, రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌ రెడ్డి పాల్గొంటారన్నారు. భారత సాయుధ దళాలు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి మద్దతుగా ప్రతిఒక్కరూ పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

‘ప్రతి భారతీయుడు తిరంగా యాత్రలో పాల్గొనాలి’

గోల్కొండ: ప్రతి భారతీయుడు తిరంగా యాత్రలో పాల్గొనాలని బీజేపీ రాష్ట్ర కిసాన్‌ మోర్చా ఉపాధ్యక్షుడు దేవర శ్రీనివాస్‌ పిలుపునిచ్చారు. పాక్‌ ప్రేరేపిత ఉగ్రవాదుల ఆటకట్టించి పాక్‌కు గట్టి బుద్ధి చెప్పిన సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో ట్యాంక్‌బండ్‌ వద్ద జరగనున్న తిరంగా యాత్రలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. కార్వాన్‌, గుడిమల్కాపూర్‌ తదితర ప్రాంతాల నుంచి తిరంగా యాత్రకు భారీ ఎత్తున ప్రజలు పాల్గొంటున్నారని ఆయన పేర్కొన్నారు.

పోలీసుల అదుపులో కన్నకూతురి హంతకుడు

గోల్కొండ: 11 రోజుల కూతురిని హత్య చేసిన కసాయి తండ్రి పోలీసుల అదుపులో ఉన్నాడు. కాగా ఇతడిని మరింత లోతుగా విచారిస్తున్నారని తెలిసింది. ఆరేళ్ల క్రితం జగత్‌ ఖైరతాబాద్‌లో నివసించే వాడు. ఆ సమయంలో కూడా అతడి మొదటి భార్య కుమారుడు అనుమానస్పందంగా మృతి చెందినట్లు తెలిసింది. అయితే గతంలో ఇంకా ఏమైనా నేర చరిత్ర ఉందా అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. భార్యతో కూడా తాగిన మైకంలో ప్రతినిత్యం గొడవ పడేవాడని పోలీసుల విచారణలో తేలింది.

మజ్లిస్‌ పార్టీకి ప్రజాదరణ


మట్లాడుతున్న మహ్మద్‌ ముస్తఫా

గోల్కొండ: మజ్లిస్‌ పార్టీకి అన్ని వర్గాల ప్రజల నుంచి ఆదరణ లభిస్తుందని ఆ పార్టీ సీనియర్‌ నాయకుడు మహ్మద్‌ ముస్తఫా అన్నారు. శుక్రవారం షేక్‌పేట్‌ సమతా కాలనీలోని తన కార్యాలయంలో జరిగిన మజ్లిస్‌ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సెక్యులర్‌ పార్టీగా తమ పార్టీ ప్రజల ఆదరణ పొందుతుందన్నారు. పార్టీ అధినేత అసదుద్దీన్‌ ఒవైసీ నికార్సైన సెక్యులర్‌ నాయకుడని అన్నారు. మజ్లిస్‌ పార్టీలో యువతకు, సీనియర్‌ నాయకులకు సమప్రాధాన్యం ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్‌ సీనియర్‌ నాయకులు నేహాల్‌, ఎంఏ బేగ్‌, మజీద్‌ తదితరులున్నారు.

రక్షణ రంగంలో స్వదేశీకరణకు కృషి


మాట్లాడుతున్న డాక్టర్‌ ఎస్‌.వి.ఎస్‌.నారాయణ మూర్తి

సంతోష్‌నగర్‌: రక్షణ రంగంలో ప్రభుత్వ దార్శనికత ‘‘మేక్‌ ఇన్‌ ఇండియా’’, ‘‘ఆత్మనిర్భర్‌ భారత్‌’’కు అనుగుణంగా రక్షణ మంత్రిత్వ శాఖ పరిధిలోని కంచన్‌బాగ్‌లోని కేంద్ర మంత్రిత్వ శాఖకు చెందిన మిశ్ర ధాతు నిగమ్‌ లిమిటెడ్‌ (మిధాని) ప్రాంగణంలో శుక్రవారం రక్షణలో స్వదేశీకరణను ప్రోత్సహించేందుకు ఎంఎస్‌ఎంఈ సమావేశాన్ని–2025 నిర్వహించారు. కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా హాజరైన మిధాని చైర్మన్‌ అండ్‌ మేనేజింగ్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ ఎస్‌.వి.ఎస్‌.నారాయణ మూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన కీలకమైన లోహాల స్వదేశీకరణలో ఎంఎస్‌ఎంఈల పాత్రను వివరించారు. వీటిలో చాలా వరకు ప్రస్తుతం భారతదేశ వ్యూహాత్మక, రక్షణ ప్రాజెక్టుల కోసం దిగుమతి చేసుకుంటున్నారన్నారు. రక్షణ సామగ్రి రంగంలో స్వావలంబన, స్థిరత్వాన్ని నిర్ధారించడానికి దేశీయ సామర్థ్యాలను అభివృద్ధి చేయాల్సిన అవసరాన్ని ఆయన గుర్తు చేశారు. మిధాని డైరెక్టర్‌ (ప్రొడక్షన్‌, మార్కెటింగ్‌) టి.ముత్తు కుమార్‌ మాట్లాడుతూ... ప్రభుత్వం మేక్‌ ఇన్‌ ఇండియా, రక్షణలో ఆత్మ నిర్భరత కార్యక్రమాలకు మిధాని మద్దతును అందిస్తుందన్నారు. వ్యూహాత్మక పదార్థాలు, తయారీలో ఆవిష్కరణ, సామర్థ్య అభివృద్ధిని పెంపొందించడానికి ఎంఎస్‌ఎంఈలతో నిరంతర సహకారం అవసరమన్నారు. కార్యక్రమంలో మిధాని జీఎం (ఫైనాన్స్‌) కె.మధుబాల, ఏజీఎం (ఐ/సీ కొనుగోలు) శుభదీప్‌ ఘోష్‌ తదితరులు పాల్గొన్నారు.

‘దిగజారుడు రాజకీయాలకు భయపడేది లేదు’


మెట్టు సాయికుమార్‌

అబిడ్స్‌: ప్రపంచ స్థాయిలో తెలంగాణ రాష్ట్రాన్ని నెంబర్‌:1 స్థాయిలో తీసుకువెళ్లేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఎనలేని కృషి చేస్తుంటే బీఆర్‌ఎస్‌ నాయకులు జీర్ణించుకోలేక అసత్య ప్రచారాలు చేస్తున్నారని తెలంగాణ రాష్ట్ర ఫిషరీష్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ మెట్టు సాయికుమార్‌ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇందిరమ్మ రాజ్యంలో పేద బడుగువర్గాలతో పాటు అన్నివర్గాల ప్రజలకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతుంటే బీఆర్‌ఎస్‌ నాయకులు చిల్లరగా వ్యవహరిస్తున్నారన్నారు. బీఆర్‌ఎస్‌ అగ్రనేత కేటీఆర్‌కు మతిస్థిమితం పోయిందన్నారు. కేటీఆర్‌ కూడా గల్లీస్థాయి నాయకుడిగా ప్రకటనలు చేస్తున్నారని మెట్టు సాయికుమార్‌ ఆవేదన వ్యక్తం చేశారు. కేటీఆర్‌కు మతిభ్రమిస్తే ఎర్రగడ్డ ఆసుపత్రిలో చికిత్స చేయించుకోవాలన్నారు. బీఆర్‌ఎస్‌ దిగజారుడు రాజకీయాలకు తాము భయపడేది లేదని, బీఆర్‌ఎస్‌కు ప్రతి ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతున్నారన్నారు.

పీస్‌ కమిటీ సభ్యుల సేవలు అమోఘం


పీస్‌ కమిటీ సభ్యులను అభినందిస్తున్న టోలిచౌకీ డివిజన్‌ ఏసీపీ సయ్యద్‌ ఫయాజ్‌

గోల్కొండ: పీస్‌ కమిటీ సభ్యుల సేవలు అమోఘమని టోలిచౌకీ డివిజన్‌ ఏసీపీ సయ్యద్‌ ఫయాజ్‌ అన్నారు. శుక్రవారం పీస్‌ కమిటీ సభ్యులు, సీనియర్‌ మజ్లిస్‌ నాయకులు మహ్మద్‌ ముస్తాఫా, మిర్జా అహ్మద్‌ బేగ్‌ ఏసీపీని ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఫ్రెండ్లీ పోలీసింగ్‌ అమలులోకి వచ్చిన తర్వాత పోలీసులకు, ప్రజలకు మధ్య సత్‌సంబంధాలు పెరిగాయన్నారు. ఈ సంబంధం మరింత పటిష్టం కావడానికి పీస్‌ కమిటీ సభ్యులు వారధిలాగా పని చేస్తారన్నారు. త్వరలోనే టోలిచౌకీ డివిజన్‌ పరిధిలోని గోల్కొండ పోలీస్‌స్టేషన్‌ పీస్‌ కమిటీని విస్తృత పరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మహ్మద్‌ ముస్తఫా, మిర్జా అహ్మద్‌ బేగ్‌ తదితరులున్నారు.

కొనసాగుతున్న దరఖాస్తుల పరిశీలన


దరఖాస్తులను పరిశీలిస్తున్న తహసీల్దార్‌ నిహారిక

యాకుత్‌పురా: రాజీవ్‌ యువ వికాసం పథకానికి అందిన దరఖాస్తుల పరిశీలన కొసాగుతుందని చార్మినార్‌ తహసీల్దార్‌ నిహారిక తెలిపారు. శుక్రవారం డబీర్‌పురాలోని మండల కార్యాలయంలో దరఖాస్తులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..రాజీవ్‌ యువ వికాసం పథకానికి తమ మండల పరిధిలో మొత్తం 7257 దరఖాస్తులు రాగా అందులో ఇప్పటి వరకు 7074 దరఖాస్తులను పరిశీలించి బ్యాంకులకు పంపించామన్నారు. పరిశీలన పూర్తవగానే జిల్లా కలెక్టర్‌, ఆర్‌డీఓ కార్యాలయాల నుంచి అర్హులైన లబ్ధిదారుల జాబితాను ప్రకటిస్తారన్నారు. పరిశీలన ప్రక్రియను ఈ నెల 15న ఆర్‌డీఓ రామకృష్ణ పరిశీలించి ఎలాంటి సమస్యలు రాకుండా క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టాలని ఆదేశించారని ఆమె తెలిపారు.

నేడు ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ సర్వసభ్య సమావేశం


గాజుల అంజయ్య

చార్మినార్‌: భాగ్యనగర్‌ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 17న సాయంత్రం ఏడు గంటలకు మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయ ప్రాంగణంలో సర్వసభ్య సమావేశం జరుగనుందని కమిటీ చైర్మన్‌ గాజుల అంజయ్య తెలిపారు. ఈ ఏడాది (2025) జరిగే ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాలను పురస్కరించుకొని ఈ సమావేశం జరగనుందన్నారు. గత ఏడాది జరిగిన బోనాల జాతర ఉత్సవాలకు భాగ్యనగర్‌ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించిన తాను ఈ ఏడాది జరగబోయే బోనాల జాతర ఉత్సవాలను పురస్కరించుకొని అక్కన్న మాదన్న మహంకాళి ఆలయ కమిటీకి బాధ్యతలను అప్పగించనున్నామన్నారు.

ప్రశాంతంగా ప్రార్థనలు


ఖాదర్‌బాగ్‌లోని ఇబ్రహీం మసీదులో..

గోల్కొండ: శుక్రవారం ప్రార్థనలు కార్వాన్‌ నియోజకవర్గంలో ప్రశాంతంగా జరిగాయి. ప్రార్థనల అనంతరం ఆపరేషన్‌ సిందూర్‌ విజయం కావడంపై మజీదు నిర్వహణ కమిటీల వారు సంబరాలు నిర్వహించారు. గోల్కొండ, రిసాలబజార్‌లోని మజీదు, అహ్మద్‌ నగర్‌లోని ఖాదరీయా మజీదు, టోలిచౌకీ చౌరస్తాలోని బిలాల్‌ మసీదులలో ఆపరేషన్‌ సిందూర్‌పై ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా మసీదు ఇమామ్‌లు భారత్‌ సైనిక దళాల ధైర్యసాహసాలను పొగిడారు. నానల్‌నగర్‌ డివిజన్‌ ఖాదర్‌బాగ్‌లోని ఇబ్రహీం మసీదులో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఎమ్మెల్యే కౌసర్‌ పాల్గొని మాట్లాడారు. పాకిస్తాన్‌కు భారత్‌ ఎప్పటికీ మరచిపోలేని గుణపాఠం నేర్పిందన్నారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్‌ కార్పొరేటర్‌ మహ్మద్‌ నసీరుద్దీన్‌, మసీద్‌ కమిటీ ప్రతినిధి షబ్బీర్‌ఖాన్‌ తదితరులున్నారు.

మురుగు.. పరుగు

పాతబస్తీలో ఏదో ఒక గల్లీలో డ్రైనేజీలు పొంగి నిత్యం రోడ్లపై ప్రవహిస్తున్న దృశ్యాలు కనిపిస్తూనే ఉంటాయి. లలితాబాగ్‌ ప్రధాన రోడ్డులో కొన్ని రోజులుగా మురుగు నీరు పారుతోంది. దీంతో స్థానికులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాధ్యమైనంత వెంటనే డ్రైనేజీని శుభ్రం చేయించాలని సంబంధిత అధికారులను కోరుతున్నారు.

– చార్మినార్‌


లలితాబాగ్‌ రోడ్డులో పొంగిపొర్లుతున్న మురుగు